క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ

మాడ్గుల: మండలంలోని సుద్దపల్లి సర్పంచ్ వెంకటేశ్వర్ గౌడ్ అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి శుక్రవారంసుద్దపల్లి వెళ్లి వెళ్లి ఆయనను పరామర్శించారు ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. మాడ్గుల, వెల్దండ, కల్వకుర్తి మండలాల కాంగ్రెస్ నాయకులు ఆయన వెంట ఉన్నారు.

రేపు బీఆర్ఎస్ సమావేశం

తుర్కయంజాల్: బీఆర్ఎస్ పార్టీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం ఆదివారం బొంగుళూర్‌లోని కళ్లెం జంగారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, బూత్ కన్వీనర్లు, కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొనాలని ఆయన కోరారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి: ఎంపీడీఓ

యాచారం: గ్రామాల్లో సమస్యలపై నిర్లక్ష్యం చేయరాదని ఎంపీడీఓ విజయలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... గ్రామాల్లో డ్రైనేజీ, తాగునీటి సమస్యలు లేకుండా చేయాలని సూచించారు. తాగునీటి పైపుల లీకేజీల వద్ద మరమ్మతులు చేపట్టాలన్నారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అన్నారు. కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. అదేవిధంగా ఇంటిపన్నులు వంద శాతం వసూల్ చేయాలని సూచించారు. పెండింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



పూజలో సర్పంచ్ ప్రేమలత, నాయకులు

ఆమనగల్లు: రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా, కసిరెడ్డి నారాయణరెడ్డి కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో ఆమనగల్లు మండలం సింగంపల్లి గ్రామ సర్పంచ్ ప్రేమలత ఆధ్వర్యంలో మొక్కులు తీర్చుకున్నారు. సింగంపల్లి గ్రామంలోని శ్రీకాశీ విశ్వనాథ ఆలయంలో శుక్రవారం సర్పంచ్ ప్రేమలత ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 101 కొబ్బరికాయలను కొట్టి మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నర్సింహ, సత్తయ్య, ప్రసాద్, మల్లేశ్, రాజు, పూజారి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ ఠాక్రేకు నేతల స్వాగతం



రాహుల్ ఠాక్రేను సన్మానిస్తున్న ప్రదీప్‌గౌడ్ తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్: రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే కుమారుడు రాహుల్ ఠాక్రే శుక్రవారం నగర శివారులోని ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చిన సందర్భంగా అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాతి ప్రదీప్‌గౌడ్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీధర్‌గౌడ్, సాయిగౌడ్, భానుయాదవ్, చందు, మహేష్, సాయియాదవ్, వాహెద్, సోను, శివ, నాని తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కడ్తాల: కడ్తాల మండల కేంద్రానికి చెందిన షబ్బీర్ ఇటీవల మృతిచెందాడు. మృతుడి కుటుంబాన్ని శుక్రవారం కడ్తాల జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్టు తరఫున రూ.5 వేలు, వైస్ ఎంపీపీ ఆనంద్ రూ.10 వేలు, సర్పంచ్ లక్ష్మీ నర్సింహారెడ్డి రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. స్థానిక నాయకులు చంద్రయ్య, జహంగీర్, రవూఫ్, జావీద్, అర్షద్, శ్రీశైలం, జంగయ్య పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

నాగోలు: శీతాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో కొత్తపేటలోని వెంకటసాయి నగర్‌లో గల శ్రీషిరిడీ సాయిబాబా ఆలయం వద్ద ఇల్లు లేని నిరుపేదలకు లయన్స్ క్లబ్ తరఫున దుప్పట్లు పంపిణీ చేశారు. నిరుపేదలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని ఈ సందర్భంగా సాయిబాబా ఆలయ చైర్మన్ శ్రీనివాస్ నాయుడు కోరారు. కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కొత్తపేట అధ్యక్షుడు లయన్ కందుకూరి శ్రీనివాస్, జోనల్ చైర్మన్ లయన్ డాక్టర్ బి. విజయ రంగా, కృషి మహిళా సంఘం అధ్యక్షురాలు లయన్ సైకం రేణుక రెడ్డి, రేపల్లె ప్రభాకర్, తిరుమల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యం



మంచాల: మల్‌రెడ్డిని సన్మానించిన కాంగ్రెస్ నాయకులు



యాచారం: మల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

మంచాల: ఇందిరమ్మ రాజ్యమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ పరిపాలన సాగిస్తుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం మంచాల మండలంలోని ఆరుట్ల, జాపాల, చెన్నారెడ్డి గూడ, లోయపల్లి గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో బడుగుబలహీన వర్గాల అభ్యున్నతి కోసం పనిచేస్తామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమే కాకుండా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో ముందుకు తీసుకుపోతామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు అండగా నిలుస్తామన్నారు. రాబోయే ఐదేళ్ల కాలంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, సర్పంచ్ కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు కావలి శ్రీనివాస్ ముదిరాజ్, మాజీ సర్పంచ్‌లు పండరిగౌడ్, యాదయ్య, నాయకులు మల్లేశ్, శ్రీనివాస నాయక్, సంజీవ, రాములు, జంగయ్యగౌడ్, గుడిమల్ల చంద్రయ్య, ఎల్లేశ్, నర్సింహ, శంకరయ్య, వెంకటరెడ్డి, లక్ష్మణ్, భాష, పరమేష్, వెంకటేశ్, దశరథ, లింగంగౌడ్, పరమేష్, సతీష్, కృష్ణ, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన చైర్‌పర్సన్

అబ్దుల్లాపూర్‌మెట్: ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఘన విజయం సాధించిన ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని శుక్రవారం పెద్దఅంబర్‌పేట మున్సిపల్ చైర్‌పర్సన్ చెవుల స్వప్న చిరంజీవితో పాటు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు కొత్తపల్లి జైపాల్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు శ్రీనివాస్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీహరి పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం: మల్‌రెడ్డి రంగారెడ్డితో నాయకులు

క్యాంపు కార్యాలయంలో..

యాచారం: ఇబ్రహీంపట్నం నూతన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, శ్రేణులు శుభాకాంక్షలు తెలిపారు. తొర్రూర్ క్యాంపు కార్యాలయంలో మాజీ ఎంపీపీ జ్యోతినాయక్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ నాయిని సుదర్శన్‌రెడ్డి, మంతన్‌గౌరెల్లి ఎంపీటీసీ సభ్యురాలు జ్యోతినాయక్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు అరవింద్‌నాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్, సుధీర్ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడీలపాలనను అంతం చేశాం..

ఇబ్రహీంపట్నం: గడీల పాలనను అంతం చేశాం.. నిర్బంధ ప్రగతి గేట్లు ఎత్తివేశాం. ప్రజాస్వామ్యయుతంగా స్వచ్ఛమైన ప్రజాపాలనను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలన సాగనుందని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు భిన్నంగా కాంగ్రెస్ మార్క్ ప్రజాపాలన ఉంటుందన్నారు. నిర్బంధాలు, ఆంక్షల నడుమ బీఆర్ఎస్ పాలన ఇన్నేళ్లు సాగిందని...ఇకపై ప్రజాస్వామ్య పరిరక్షణే లక్ష్యంగా ప్రజలకు చేరువగా రేవంత్‌రెడ్డి పాలన ఉంటుందన్నారు. ప్రజల కోసమే అధికారులు పని చేయలన్నారు. ఎన్నికల మెనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ఆరు గ్యారంటీల పథకాల అమలుదిశగా ప్రభుత్వం ముందుకెళ్తుందన్నారు. శనివారం నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని ప్రభుత్వం కల్పించిందన్నారు. తన విజయం ప్రజా విజయమని మల్‌రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి నిరంతం కృషిచేస్తానన్నారు.

మల్‌రెడ్డిని కలిసిన నేతలు..

ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతిచందు, కౌన్సిలర్లు మంగ జగదీశ్వర్‌యాదవ్, రమేష్ శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని మండల, మున్సిపల్, పోలీస్ అధికారులు మల్‌రెడ్డిని కలిసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గం అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు.

నాడు కళాకారుడు.. నేడు అర్చకుడు

- ఆదరణ లేక అవస్థలు పడుతున్న నటుడు వెంకటేశ్వరరావు
- చరమాంకంలో దుర్భర జీవితం
- ఆదుకోవాలని వేడుకోలు



ప్రశంసా పత్రాలు, అవార్డులను చూపిస్తున్న వెంకటేశ్వరరావు

అబ్దుల్లాపూర్‌మెట్: అతను ఒకప్పుడు మంచి రికార్డింగ్ వాయిద్య కారుడు..అంతే కాకుండా అలనాటి పాత కాలపు సంగీత విద్వాంసుల బృందంలో ఒక సభ్యుడు...దీంతో పాటు పాతకాలం సినిమాలైన రంగస్థలంలో హరిచంద్రుడిగా, రాయబారంలో కృష్ణుడిగా, రామాంజనేయ యుద్ధంలో ఆంజనేయుడి వంటి పాత్రలతో పాటు అంతస్థులు, ప్రేమించి చూడు, అవేకళ్లు వంటి చిత్రాల్లో నటించిన ఆర్టిస్టు. అలాంటి కళాకారుడికి నేడు ఆదరణ కరువు అవ్వడంతో ఎనిమిది పదుల వయస్సులో ఇబ్బందులు పడుతున్నాడు. జానెడు పొట్ట కోసం జీతం లేకపోయినా చిన్న దేవాలయంలో అర్చకుడిగా పని చేస్తూ భక్తులు ఇచ్చే దక్షిణంతోనే పూట వెల్లదీసుకుంటున్న ఆ నిరాధరణ కళాకారుడే ముత్యాల వెంకటేశ్వరరావు(85). పుట్టి పెరిగింది కృష్ణా జిల్లా గుడివాడలో అయినా 30 ఏళ్ల క్రితం హైదరాబాద్‌కు వచ్చి రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామంలో ఉంటూ భార్యతో కలిసి అక్కడక్కడ హరికథలు చెప్పుకుంటూ జీవనం సాగించాడు. క్రమంగా హరికథలు, రంగస్థల నాటకాలకు ఆదరణ లేకపోవడంతో ఆయన రోజురోజుకు దీనస్థితికి చేరుకున్నారు. దీంతో ఆర్థిక భారం వల్ల ఆయన భార్య ఏడాదిన్నర క్రితం మృతిచెందడంతో ఆయన రోడ్డున పడ్డారు. ఆదుకునే వారు లేకపోవడంతో ఇనాంగూడ గ్రామంలోని ఆంజనేయుడి దేవాలయంలో వేతనం లేకుండానే అర్చకుడిగా పని చేస్తూ భక్తులు ఇచ్చే దక్షిణంతో జీవనం సాగిస్తున్నాడు. తన కళను మెచ్చి చిత్ర, సంగీత పరిశ్రమలకు చెందిన ప్రముఖుల నుంచి అవార్డులు, ప్రశంసాపత్రాలు పొందినా వాటితో కడుపునింపుకోలేని దుస్థితిలో ఉన్నానని, తనను ప్రభుత్వం కానీ, చిత్ర, సంగీత పరిశ్రమలు కానీ ఆదుకోవాలంటూ వెంకటేశ్వరరావు (98494 61848) వేడుకుంటున్నాడు. ప్రముఖ సంగీత విద్వాంసులైన ర్యాలీ పిచ్చయ్యశాస్త్రి(ఘంటసాల మేనమామ), ఎం.ఎస్ బాలసుబ్రమణ్యశర్మల వద్ద పనిచేశారు.

దారిదోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరి అరెస్టు

హస్తినాపురం: రౌడీషీటర్‌తో కలిసి దారి దోపిడీలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన ఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వనస్థలిపురం సీఐ దేప జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని కేపీహెచ్‌బీ కాలనీ అడ్డగుట్ట సొసైటీ ప్రాంతానికి చెందిన పీలా ఈశ్వర్ గణేశ్ ఈనెల 1వ తేదీ సాయంత్రం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్ మండలం కొత్తగూడెం నుంచి తన ముగ్గురు మిత్రులు విశ్వకాంత్, సుజుత్, విష్ణులతో కలిసి తన కారులో నగరం వైపు బయలుదేరాడు. మార్గం మధ్యలో పెద్దఅంబర్‌పేట వద్ద వెనుక నుంచి అతివేగంగా వచ్చిన కారు (టీఎస్04 ఈఎస్ 8885) గణేశ్ కారును ఢీకొట్టి ముందుకు వెళ్లిపోయింది. దీంతో ఆ కారును వెంబడించి హైకోర్టు కాలనీకి వద్ద ఆపి తమ కారు ధ్వంసమైందని, మరమ్మతు కోసం నష్టపరిహారం చెల్లించాలని అడుగుతుండగా... అదే సమయంలో ద్విచక్ర వాహనం (టీఎస్ 07ఎఫ్ఆర్ 9914)పై వచ్చిన ముగ్గురు ఏం జరిగిందని అడిగారు. ఆ ముగ్గురిలో ఓ వ్యక్తి 'నా పేరు మంజునాథ్, వనస్థలిపురంలో రౌడీని, మీ సమస్యను పరిష్కరిస్తా' అని అన్నాడు. గణేశ్‌కు ఎయిర్ గన్ చూపించి మీ ఫోన్లు, మీ దగ్గర ఉన్న డబ్బులు ఇవ్వాలని బెదిరించారు. నిరాకరించడంతో వారిపై దాడి చేసి ఐఫోన్, విలువైన నైక్ షూ గుంజుకున్నారు. బాధితుడు గణేశ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసిన పోలీసులు యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్‌నారాయణపురం గ్రామానికి చెందిన పోలోజు శరత్‌చంద్ర (22), కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన ప్రశాంత్ (23)లను అరెస్ట్ చేశారు. వారివద్ద నుంచి రూ.50 వేల నగదు, ఒక ఐఫోన్, ద్విచక్ర వాహనం, మరో రెండు మొబైల్ ఫోన్ల స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించామని, పరారీలో ఉన్న రౌడీషీటర్ మంజునాథ్ కోసం ప్రత్యేక బృందంతో గాలిస్తున్నామని సీఐ జలేంధర్‌రెడ్డి తెలిపారు. నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 23వ డివిజన్‌లోని ఎస్‌బీఆర్ కాలనీలో శుక్రవారం బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిన్నటిదాక ఎన్నికల కోడ్ ఉన్న కారణంగా అభివృద్ధి పనులు నిలిచిపోయినట్లు తెలిపారు. కోడ్ ముగియడంతో బడంగ్‌పేట కార్పొరేషన్‌లోని అన్ని డివిజన్లలో మంజూరైన పనులు వేగవంతంగా జరుగుతాయన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సంతోషిరెడ్డి, డీఈఈ జ్యోతిరెడ్డి, ఏఈఈ వినీల్‌గౌడ్, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, మహిళలు ఉన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి

మహేశ్వరం: వేద పండితుల మంత్రోచ్చరణలతో, డప్పు, వాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో శ్రీపద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం కమనీయంగా శుక్రవారం నిర్వహించారు. మండలంలోని అమీర్‌పేట్ గుట్టపైన వెలసిన శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో 15వ వార్షిక బ్రహ్మోత్సవాలు మూడో రోజు ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారు, అమ్మవారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవ కమిటీ సభ్యులు గ్రామంలో పూరవీధుల గుండా ఊరేగించారు. గ్రామ సర్పంచ్ బస్వ శ్రీశైలం గౌడ్ దంపతులు స్వామివార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ నర్సింగ్,ఎంపీటీసీ రాయప్ప, ఆలయ కమిటీ అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు జగదీష్, బుచ్చిబాబు, కోశాధికారి భాస్కర్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, కమిటీ సభ్యులు రాజు, నారాయణ చారి, దేవవరం గౌడ్, నర్సింహ, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సమన్యాయం



నేదునూరులో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

కందుకూరు: మండలంలోని నేదునూరులో వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ ప్రధానకార్యదర్శి ఎండీ అఫ్జల్ బేగ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారంటీలపై మొదటి సంతకం చేసినందుకు శుక్రవారం ఆయన చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గడీల పాలనకు చరమగీతం పాడి కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రజా పాలన తెచ్చారని కొనియాడారు. గత పాలకులు అన్ని వర్గాలను మోసం చేశారని విమర్శించారు. కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు సమ ప్రాధాన్యం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సంజీవ, పెంటయ్య, యంజాల్ రెడ్డి, ఎండీ పాషా, ఎండీ మిస్కిన్‌ఖాన్, పాండురంగారెడ్డి, యాదయ్య, మహేందర్, దర్శన్, సుధాకర్, మహేశ్, శ్రీను, కృష్ణ, శంకర్, జగన్, భిక్షపతి, మైసయ్య, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఆమె'కు ఉచిత బస్సు ప్రయాణం

- మార్గదర్శకాలను జారీచేసిన ప్రభుత్వం
- ఇబ్రహీంపట్నం డిపోలో 120 బస్సులు



ఇబ్రహీంపట్నం ఆర్టీసీ బస్ డిపో

ఇబ్రహీంపట్నం: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం శనివారం మధ్యాహ్నం రెండు గంటల నుంచి అమలు కానుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా ఈ పథకాన్ని అమలు పరుస్తున్నారు. మహిళల, విద్యార్థినుల, ట్రాన్స్‌జెండర్ల బస్ పాసులు ఇక రెన్యూవల్స్ చేయరు. కౌంటర్లలో నిలబడి పాస్ రెన్యూవల్ చేసుకునే బాధ వారికి తప్పుతుంది. ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో 120 ఆర్టీసీ, అద్దె బస్సులున్నాయి. సుమారు 700 మందికి పైగా సిబ్బంది పనిచేస్తారు. ప్రతిరోజు రూ.12–13 లక్షల వరకు డిపోకు ఆదాయం వస్తుంది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో 40 నుంచి 45 శాతం ఆదాయం తగ్గనుంది. రియంబర్స్‌మెంట్ కింద ప్రభుత్వం ఈ డబ్బును ఆర్టీసికి తిరిగి చెల్లించనుంది. ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశానుసారం డిపో మేనేజర్ వెంకటనర్సప్ప, అసిస్టెంట్ మేనేజర్ సరస్వతి మహిళల ఉచిత ప్రయాణంపై ఆర్టీసీ కండక్టర్లకు, సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతి ట్రిప్పులో ప్రయాణిస్తున్న మహిళల సంఖ్యను ఎస్‌ఆర్‌లో విధిగా నమోదు చేయాలని తెలిపారు. మహిళల పట్ల మర్యాదగా మసులుకోవాలని, ఏలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. మహిళలు ఎక్కువ మంది బస్సుల్లో ప్రయాణించే అవకాశం ఉన్నందున ప్రతి బస్టాప్‌లో నిలిపి జాగ్రత్తగా విధులను నిర్వర్తించాలని కోరారు. టీం సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి వచ్చిన అనంతరం మహిళలకు, అమ్మాయిలకు, ట్రాన్స్‌జెండర్లకు జీరో టికెట్ ఇవ్వాల్సి ఉంటుందని వెల్లడించారు. అయితే ఉచిత బస్సు ప్రయాణంపై మహిళలు తమ ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేగా మల్‌రెడ్డి గెలిచాడని..

- యాదగిరిగుట్ట వరకు పాదయాత్ర
- అభిమానం చాటుకున్న కాంగ్రెస్ నేతలు



పాదయాత్రగా బయలుదేరిన నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యేగా కాంగ్రెస్ అభ్యర్థి మల్‌రెడ్డి రంగారెడ్డి గెలిస్తే యాదగిరిగుట్టకు కాలినడకన వస్తామని కాంగ్రెస్ శ్రేణులు మొక్కుకున్నారు.వారి ఆశలు నెరవేరడంతో శుక్రవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని బొంగ్లూర్ నుంచి శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలో బొంగ్లూర్‌కు చెందిన 10 మంది బృందం యాదగిరి గుట్టకు పాదయాత్రగా బయలుదేరారు. ముందగా బొంగ్లూర్‌లోని ఈశ్వరాంజనేయ ఆలంలో పూజలు చేశారు. ఔటర్ రింగ్‌రోడ్డు సర్వీస్‌రోడ్డు మీదుగా యాదగిరిగుట్టకు బయలుదేరారు. పాదయాత్ర చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి బృందానికి మాజీ ఎంపీపీ మర్రి నిరంజన్‌రెడ్డి సంఘీబావం ప్రకటించారు. దిగ్విజయంగా యాత్ర పూర్తిచేయాలని సూచించారు. మాజీ సర్పంచ్ గణేష్, ఉప సర్పంచ్ యాదగిరిరెడ్డి, రామారావు, రాంరెడ్డి పాదయాత్రగా బయలుదేరారు.

కసిరెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



కసిరెడ్డిని సన్మానించిన సత్యం



కసిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన కసిరెడ్డి నారాయణరెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, కడ్తాల సీఐ శివప్రసాద్, ఆమనగల్లు ఎస్ఐ బల్‌రాం మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి మండలాలకు చెందిన పలువురు కాంగ్రెస్ ప్రజాప్రతినిదులు ఆయనను కలసి శుభాకాంక్షలు తెలిపారు. మాడ్గుల జెడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కిషన్ రెడ్డి, మాజీ సర్పంచ్ యాదయ్యగౌడ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు దళపతి, కేఎస్ఆర్ యువసేన జిల్లా నాయకులు విజయ్‌రాథోడ్, ఉపసర్పంచ్ మల్లేశ్, నాయకులు తదితరులు కసిరెడ్డిని కలిసినవారిలో ఉన్నారు. అలాగే శతాబ్ది టౌన్‌షిప్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కసిరెడ్డిని కలిసిన సత్యం..

కల్వకుర్తి ఎమ్మెల్యేగా ఎన్నికైన కసిరెడ్డిని శుక్రవారం జిల్లా కాంగ్రెస్ నాయకులు ఎగిరిశెట్టి సత్యం కలిసి ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

వ్యర్థాలను రోడ్డుపై వేయొద్దు

సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి



పారిశుద్ధ్య పనులు చేయిస్తున్న సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల: రహదారుల పక్కన వ్యర్థాలను వేయవద్దని కడ్తాల సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. కడ్తాల గ్రామ పరిధిలోని హైదబాద్–శ్రీశైలం జాతీయ రహదారికి ఇరువైపులా వేసిన వ్యర్థాలను శుక్రవారం గ్రామ పంచాయతీ సిబ్బందితో శుక్రవారం తొలగించారు. సర్పంచ్ మాట్లాడుతూ.. జాతీయ రహదారికి ఇరువైపులా వ్యర్థాలను తీసుకువచ్చి వేయడం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. వ్యర్థాలను రోడ్డుపక్కన వేసే వారిని గుర్తించి గ్రామ పంచాయతీ తరఫున జరిమానా విధిస్తామని హెచ్చరించారు. పారిశుద్ధ్య పనులకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాఘవేందర్, వార్డు సభ్యులు రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత ఆశయాలను ఎంచుకోవాలి

జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ నర్సింహారెడ్డి



సర్టిఫికెట్లు అందజేస్తున్న నర్సింహారెడ్డి

ఇబ్రహీంపట్నం: విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయాలని... అందుకు అనుగుణంగా ముందుకెళ్లాలని జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ కట్టా నర్సింహారెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని సైంట్ ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఆచరణాత్మక జ్ఞానం విద్యార్థులకు ఎంతో అవసరమన్నారు. విద్యార్థి దశలోనే ఉన్నత ఆశయాలతో ముందుకెళ్తే జీవితంలో ఏదైనా సాధించవచ్చునన్నారు. సైంట్ ఇంజనీరింగ్ విద్యాసంస్థకు వచ్చే విద్యా సంవత్సరం నుంచి స్వయం ప్రతిపత్తి కల్పిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంచి నాణ్యత ప్రమాణాలతో విద్యాసంస్థను నడిపిస్తున్న యాజమాన్యాన్ని ఆయన అభినందించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సినీ గాయకులు యశస్వి కొండెపూడి పాటలు విద్యార్థులను అలరించాయి. చదవులో, క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులను, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. సైంట్ కళాశాల చైర్మన్ డా.కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ డా.వేణుగోపాల్‌రెడ్డి, ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల ప్రిన్సిపాల్స్ డా.అనిల్‌కుమార్, డా.హరికృష్ణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వంశీకృష్ణ పాల్గొన్నారు.

ప్రజాపాలన ప్రారంభమైంది

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజాపాలన ప్రారంభమైందని పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో ఒకటైన మహాలక్ష్మి పథకంలో భాగంగా నేటి నుంచి మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన చెప్పారు. కడ్తాల మండలం మైసిగండిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో దొరలపాలన ముగిసిందని ప్రజాపాలన ప్రారంభమైందని అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రజలందరి భాగస్వామ్యం ఉంటుందని, తెలంగాణ ప్రజలు కోరుకున్న విధంగా రేవంత్‌రెడ్డి పాలన సాగుతుందని ఆయన వివరించారు. రైతు భరోసా పథకం, నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పన విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి ఉంటుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జవహర్‌లాల్ నాయక్, హీరాసింగ్, తులసీరాం, రమేశ్, తులసీరాం నాయక్, శ్రీకాంత్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.